జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే బీఎల్ఆర్ తదితరులు

ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దమే లక్ష్యం

- ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడటౌన్, జూన్ 16 : ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించాలని, మౌలిక వసతులు కల్పించే బాధ్యత తాను తీసుకుంటానని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలోని హౌసింగ్‌బోర్డ్‌లో గల ఎస్‌పీ కన్వెన్షన్ హాల్‌లో ప్రొ. జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం నిర్వహించిన ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు, దవాఖానల అభివృద్ధిపైనే తన దృష్టి ఉంటుందని, నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి నాణ్యమైన విద్యను అందించాలన్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, ఎంఈఓ బాలాజీ నాయక్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పీఆర్‌టీయూ, టీఎస్‌యూటీఎఫ్, పీఆర్‌టీయూ తెలంగాణ, టీజీయూఎస్, ఎస్‌టీయూ, టీపీయూఎస్ ఇతర ఉపాధ్యాయ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ఉద్యోగ విరమణ

నల్లగొండ రూరల్ 16 : ప్రతి ఉద్యోగికి పదవి విరమణ సహజమని, విధి నిర్వహణలో ఉన్నప్పుడే పేరు ప్రతిష్ఠలు సాధించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. మండలంలోని చందనపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న పల్లెబోయిన వసంత రేణుక పదవి విరమణ పొందిన సందర్భంగా అదివారం ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఆర్టీఐ మాజీ కమిషనర్ వర్రె వెంకటేశ్వర్లుతో కలలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం రేణుక దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ అరుంధతి, ఎడ్ల సైదులు, శ్రవణ్‌కుమార్, కృష్ణారెడ్డి, పెద్ది ఇందిరమ్మ, సురిగి మణెమ్మ, పాలడుగు పద్మ, వసంత పాల్గొన్నారు.

'పంచాయతీ వర్కర్ల వేతనాలు చెల్లించాలి'

దామరచర్లలో సీఐటీయూ సమావేశంలో మాట్లాడుతున్న దయానంద్

దామరచర్ల, జూన్ 16 : ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ వర్కర్ల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ మండల కార్యదర్శి బైరం దయానంద్ అన్నారు. మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన జనరల్‌బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ జీపీ వర్కర్లకు సకాలంలో వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారని, సబ్బులు, గ్లౌసులు ఇతర సామగ్రి కూడా అందించడం లేదన్నారు. సమస్యల పరిష్కారానికి ఈనెల 17న ఎమ్మెల్యే ఇంటి ముందు ధర్నాలు, మండలంలోని ఎంపీటీసీ, జడ్పీటీసీలకు వినతి పత్రాలు, జూన్ 18 నుంచి 22 వరకు కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించనున్నట్లు తెలిపారు. జూలై మొదటి వారంలో చలో హైదరాబాద్ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు వాడపల్లి శ్రీరాములు, ఎండీ సైదులు, వట్టపు గురవయ్య పాల్గొన్నారు.

చెన్నకేశవులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఎస్పీ రాజశేఖర్ రాజు

పోలీస్ అమరుల త్యాగాలు వెలకట్టలేనివి : డీఎస్పీ

నిడమనూరు, జూన్ 16 : శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని మిర్యాలగూడ డీఎస్పీ కె.రాజశేఖర్ రాజు అన్నారు. పోలీస్ అమరవీరుడు ఉన్నం చెన్నకేశవులు వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ కూంబింగ్‌లో భాగంగా మావోయిస్టుల మందుపాతరకు బలైన చెన్నకేశవులు త్యాగం స్ఫూర్తిదాయకమన్నారు. అమరవీరుల స్ఫూర్తితో శాంతి భద్రతల పరిరక్షణకు సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలన్నారు. అనంతరం జాతీయ రహదారి విస్తరణలో భాగంగా తొలగించిన చెన్నకేశవులు విగ్రహాన్ని పరిశీలించి త్వరలోనే విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పేదలకు పండ్లు పంపిణీ చేసి స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. కార్యక్రమంలో నిడమనూరు ఎస్ఐ జె.గోపాల్‌రావు, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఉన్నం చిన్నవీరయ్య, చెన్నకేశవులు కుటుంబ సభ్యులు ఉన్నం పూర్ణచందర్‌రావు, ఉన్నం ఈశ్వర్ ప్రసాద్, ఉన్నం ఉషాకిరణ్, నాయకులు విశ్వనాథుల రమేశ్, చాపల వెంకట్‌రెడ్డి, కుందూరు లక్ష్మారెడ్డి, గాయకవాడ లక్ష్మీనారాయణ, కబడ్డీ క్రీడాకారులు ఎండీ షహీద్, మంగినపల్లి వెంకటయ్య, పోలేపల్లి యాదగిరి, పెదమాం రాజు, దుబ్బ శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ NAMASTHE TELANGANA CLASSIFIEDS

CHANGE OF NAME

I, Kamsani Srinivas, S/o. Kamsani Mallaiah qualification: M.Sc., Occ: Telangana State Govt. Employee shall henceforth be known Kamsani Srinivas Reddy, S/o. Kamsani Mallaiah for the purpose of correction of wrong entries occurred in school records due to parental mistake/due to marriage.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/- ప్రతి అదనపు లైన్‌కు 50/-

Note: 3+1 Scheme Available Minimum 4 Lines, Extra Line - Extra Amount 5% GST అదనం

పూర్తి వివరాలకు: నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.

నల్లగొండ : 9182777626	నల్లగొండ : 9182777635	దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059	సూర్యాపేట : 9182777630	భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059	కోదాడ : 9182777196	తుంగతుర్తి : 9182777638

కట్టంగూర్ పీహెచ్‌సీ.. ప్రారంభానికే పరిమితం

- మూడు నెలలైనా అందుబాటులోకి రాని వైద్య సేవలు

కట్టంగూర్‌లో నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీ

కట్టంగూర్, జూన్ 16 : సర్కార్ దవాఖానలను అత్యాధునిక వసతులతో తీర్చిదిద్ది పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు గత ప్రభుత్వం కట్టంగూర్ మండల కేంద్రంలో నూతన పీహెచ్‌సీ భవనాన్ని నిర్మించింది. పాత భవనం శిథిలావస్థకు చేరి వర్షాలకు కురుస్తుండడంతో వైద్య సేవలకు ఆటంకం కలిగేది. దాంతో నాటి ప్రభుత్వం అదనపు గదుల నిర్మాణానికి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 1.56కోట్లు మంజూరు చేసింది. భవన నిర్మాణ పనులకు అప్పటి ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య 2023 ఫిబ్రవరి 24న శంకుస్థాపన చేశారు. దాంతో సదరు కాంట్రాక్టర్ నిర్మాణ పనులను ఏడాదిలోనే పూర్తి చేశాడు. పార్లమెంట్ ఎన్నికల కోడ్‌కు ముందే 2024 మార్చి 11 ఎమ్మెల్యే వేముల వీరేశం దవాఖానను ప్రారంభించారు. అయినప్పటికీ భవనానికి తాళం వేసి ఉంచారు. అధికారులు స్పందించి వర్షాలు రాకముందే కొత్త బిల్డింగ్‌లో వైద్య సేవలు అందుబాటులోకి తెవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ప్రాథమిక వైద్యాధికారి శ్వేతను వివరణ కోరగా బిల్డింగ్ ప్రారంభించినప్పటికీ సంబంధిత ఇంజినీరింగ్ విభాగం అధికారులు తమకు ఇంకా అప్పజెప్పలేదని తెలిపారు.

పేకాడుతున్న 10 మంది అరెస్ట్

మర్రిగూడ, జూన్ 16 : మండలంలోని సరంపేట శివారు లక్ష్మీనర్సింహ స్వామి గుట్ట ప్రాంతంలో పేకాడుతున్న 10 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ రంగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పక్కా సమాచారంతో రైడ్ చేసి 10 మందిని అరెస్ట్ చేశామని, వారి నుంచి 3.51లక్షల నగదు, రెండు కార్లు, మూడు బైక్‌లు, 9 సెలఫోన్లు,15 సెట్ల కార్డులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. విచారణలో భాగంగా ఏ1గా పగిళ్ల రమేశ్(రాంరెడ్డిపల్లి), ఏ2గా మెరుగు శ్రీనివాస్(కమ్మగూడెం), ఏ3 నోముల రవిశేఖర్(కమ్మగూడెం), ఏ4 ఎల్లంకి జగన్(కొండాపురం), ఏ5 కోల రాములు(నేరేడుచర్ల), ఏ6 గాదె మధు(మిర్యాలగూడ), ఏ7గా చెట్టి శ్రీనివాస్(హుజూర్‌నగర్), ఏ8 పాముల శివ శంకర్(రాంరెడ్డిపల్లి), ఏ9గా కావలి నాగార్జున(రాంరెడ్డిపల్లి), ఏ10గా వాకిటి హరీశ్(రాంరెడ్డిపల్లి)ని నిందితులుగా చేర్చినట్లు తెలిపారు. ఏ1 రమేశ్ ప్రతీ ఆటకు 5వేలు కమీషన్ తీసుకొని పేకాట స్థావరాన్ని ఏర్పాటు చేసినట్లు విచారణలో తేలిందన్నారు. కేసు నమోదు చేసి నిందితులను జ్యుడిషియల్ కస్టడీకి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

నార్కెట్‌పల్లిలో..

నార్కెట్‌పల్లి : నార్కట్‌పల్లి గ్రామ శివారులో ఆదివారం సాయంత్రం ఓ ఇంట్లో కొందరు వ్యక్తులు పేకాడుతుండగా పోలీసులు రైడ్ చేసి పట్టుకున్నారు. పక్కా సమాచారంతో పోలీస్ సిబ్బంది ఇంటిపై రైడ్ చేసి 8 మందిని పట్టుకున్నట్లు ఎస్ఐ అంతిరెడ్డి తెలిపారు. వారి నుంచి నాలుగు బైక్‌లు, ఒక కారు, 9 సెల్‌ఫోన్‌లు, రూ.1.45 లక్షల నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గీతామందిర్ ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు

మిర్యాలగూడ టౌన్, జూన్16 : పట్టణంలోని సీతారాంపురంలో శ్రీరుక్మిణీ సత్యభామ శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం యాగశాలలో సకలాభీష్టసిద్ధి కోసం శ్రీలక్ష్మీనారాయణ దిష్టి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఆలయ విగ్రహాలకు స్వర్ణకవచాలు సమర్పించిన చెనుమల్ల అశోక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వారిని ఆలయ అధ్యక్షుడు డాక్టర్ బండారు కుశలయ్య, కమిటీ సభ్యులు, వేద పండితులు సన్మానించారు. సోమవారం జరిగే పూర్ణాహుతి కార్యక్రమానికి భక్తులు పాల్గొనాలని కోరారు.

ఉత్తరపల్లికి జాతీయ వజ్రమణి స్వర్ణ సింహా బ్రహ్మ అవార్డు

నార్కట్‌పల్లి జూన్ 16 : మండలంలోని మాండ్ర గ్రామానికి చెందిన ఆంజనేయ స్వామి దేవస్థాన అర్చకుడు ఉత్తరపల్లి నరసింహాచార్యులకు జాతీయ వజ్రమణి స్వర్ణ సింహా బ్రహ్మ కంకణా, ఐరావతం అవార్డు అందించారు. వరంగల్‌లో నిర్వహించిన అవార్డుల పంపిణీలో ఆదివారం దేవాదాయ ధర్మాదాయ శాఖ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అద్దంకి నాగేశ్వరరావు చేతుల మీదుగా ఉత్తరపల్లి అవార్డును అందుకున్నారు.

టోర్నమెంట్లతో క్రీడా ప్రతిభ : యశ్వంత్

నిడమనూరు, జూన్ 16 : గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభను మెరుగు పర్చేందుకు క్రికెట్ టోర్నమెంట్లు ఎంతగానో దోహదం చేస్తాయని మండల కాంగ్రెస్ నాయకుడు బైరెడ్డి యశ్వంత్‌రెడ్డి అన్నారు. వేంపాడు గ్రామంలో ఆదివారం వేంపాడు యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన నిడమనూరు ఎస్ఐ. గోపాల్‌రావుతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో బుర్రి పరమేశ్, పోలగోని శ్రీను, ఊట విజయ్, వెంపటి రాము, పోతుగంటి ఉమాశంకర్, సిరసనగండ్ల మధు, నడ్డి నాగరాజు, గద్దల జానీ, చిలుముల మధుకుమార్ తదితరులున్నారు.

వాసవీ మాత అలయంలో ప్రత్యేక పూజలు

వాసవీమాత అలయంలో పూజలు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కొండమల్లేపల్లి, జూన్ 9 : మండల కేంద్రంలోని సాగర్ రోడ్డులో ఉన్న వాసవీమాత ఆలయ వార్షికోత్సవం సందర్భంగా అలయ కమిటీ ఆధ్వర్యంలో అదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో హోమం, పుష్పార్చన, కుంకుమార్చన, పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణాధ్యక్షుడు పూరె జనార్దన్, యాదయ్య, బుచ్చిరాములు, దనుంజయ్య పాల్గొన్నారు.

బొడ్రాయికి అభిషేకం చేస్తున్న కిష్టాపురం గ్రామస్తులు

వానల కోసం గ్రామ దేవతలకు పూజలు

మునుగోడు, జూన్ 16 : మండలంలోని కిష్టాపురం గ్రామంలో వర్షాలు కురవాలని ఆదివారం గ్రామ దేవతలకు పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు నీటి బిందెలతో అభిషేకం చేసి మొక్కులు తీర్చుకున్నారు. సకాలంలో వర్షాలు కురువాలని, పంటలు పండాలని కోరుకున్నారు. గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

పట్టుబడిన పీడీఎస్ బియ్యం

కొండమల్లేపల్లి, జూన్ 16 : అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ రామ్మూర్తి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బద్యానాయక్ తండాకు చెందిన నేనావత్ చిరంజీవి బోలెరో ట్రాలీ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 50 బస్తాలు సుమారు 25 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని కొండమల్లేపల్లి చౌరస్తాలో తనిఖీలు చేపట్టి పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం

వైద్య శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

మిర్యాలగూడ టౌన్, జూన్ 16 : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని హౌసింగ్ బోర్డులో గల నవజ్యోతి స్కూల్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మూర్ఛ, పక్షవాతం, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు డాక్టర్ గోపాల శివన్నారాయణ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. డాక్టర్ శ్రీనివాసరాజు, నామిరెడ్డి శేఖర్‌రెడ్డి, పి.లక్ష్మీ నారాయణశర్మ దాతలుగా వ్యవహరించారు. కోల శ్రీనివాస్, రమణారెడ్డి, నక్కశ్రీనివాస్, కృష్ణారావు, కోటిరెడ్డి, మట్టారెడ్డి, కేశవులు, సత్యనారాయణ, నసీమ, శోభ, మహిత, పి.సత్యనారాయణరావు పాల్గొన్నారు.

ఏవీఎంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నకిరేకల్, జూన్ 16 : ఏవీఎం ఎయిడెడ్ ఉన్నత పాఠశాల 1998-99 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. 25 ఏండ్ల తరువాత కలువడంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకొని ఆనందంగా గడిపారు. ఉపాధ్యాయులను విద్యార్థులు శాలువా, మెమెంటోలతో సత్కరించి, మొక్కలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఏవీఎం విద్యాసంస్థల అధినేత కందాల పాపిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న ఆవులు పట్టివేత

కొండమల్లేపల్లిలో పట్టుబడిన ఆవులు

కట్టంగూర్, జూన్ 16 : అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఆవులను గురువారం కట్టంగూర్ పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని అయిటిపాముల గ్రామశివారులోని చెర్వుఅన్నారం స్టేజీ వద్ద జాతీయ రహదారిపై ఎస్ఐ ఎన్.శ్రీను సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కంటెయినర్ వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 40ఆవులు, 20ఎద్దులు ఉన్నట్లు గుర్తించారు. డ్రైవర్ వహీద్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా హైదరాబాద్‌లోని కబేళాకు తరలిస్తున్నట్లు ఒప్పుకున్నాడు. ఆవులను చండూరులోని గోశాలకు తరలించారు. వాహనాన్ని సీజ్ చేసి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

కొండమల్లేపల్లిలో..

కొండమల్లేపల్లి మండల కేంద్రంలో అక్రమంగా తరలిస్తున్న 12 ఆవులను ఆదివారం పట్టుకున్నారు. పెట్రోలింగ్ చేస్తుండగా అనుమానం వచ్చి డీసీఎంను తనిఖీ చేయగా అందులో 12 ఆవులను గుర్తించినట్లు ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు. విచారణలో వాటిని హైదరాబాద్‌లోని కబేళాకు తరలిస్తున్నట్లు తెలిసిందని కేసు నమోదు చేసి ఆవులను గోశాలకు తరలించినట్లు ఆయన పేర్కొనారు.

త్యాగ గుణాన్ని తెలిపేదే బక్రీద్

- శుభాకాంక్షలు తెలిపిన మండలి చైర్మన్ గుత్తా, మంత్రి కోమటిరెడ్డి

రామగిరి, జూన్ 16 : త్యాగానికి ప్రతీకగా జరుపుకొనే బక్రీద్ (ఈద్ అల్ అదా) సందర్భంగా ముస్లింలకు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. దేవుడిపై విశ్వాసాన్ని కలిగి, సన్మార్గంలో జీవనాన్ని సాగించాలనే గొప్ప సందేశాన్ని బక్రీద్ పండుగ మానవాళికి ఇస్తుందని పేర్కొన్నారు. భక్తిని, త్యాగ గుణాన్ని ఈ పండుగ తెలియజేస్తుందని తెలిపారు. తమకు ఉన్నంతలో ఇతరులకు దానం చేయాలనే గొప్ప గుణాన్ని బక్రీద్ పండుగ తెలియజేస్తుందని చెప్పారు.

ముస్లింలకు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగం, సహనం ఇచ్చే సందేశాలకు ప్రతీక అని పేర్కొన్నారు. దైవ ప్రవక్త ఇబ్రహీం త్యాగాన్ని స్మరించుకుంటూ..

ముస్లిం సోదరులందరూ ఆత్మీయంగా ఈ పండుగ జరుపుకొంటారని తెలిపారు. కరుణకు, భక్తికి, విశ్వాసానికి, ఐక్యతకు సంకేతమైన ఈ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. అల్లాహ్ అనుగ్రహం, మహ్మద్ ప్రవక్త ఆశీస్సులు తెలంగాణ ప్రజలందరికీ ఎప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.



ఆలయంలో పూజల్లో పాల్గొన్న కంచర్ల భూపాల్‌రెడ్డి

అందరూ సుఖ శాంతులతో ఉండాలి

- మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ సిటి, జూన్ 16 : ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. కనగల్ మండలం దర్వేశిపురం రేణుక ఎల్లమ్మ బ్రహ్మోత్సవాల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అర్చకులు అమ్మవారి తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాలను ఆయనకు అందించారు. కార్యక్రమంలో నల్లగొండ పట్టణాధ్యక్షుడు భువనగిరి దేవేందర్, నాయకులు రావుల శ్రీనివారెడ్డి, నల్లబోతు యాదగిరి, మాజీ సర్పంచ్ అంజమ్మ రామచంద్రు, ఉపసర్పంచ్ అంజమ్మ, నాగరాజు, మహిళా అధ్యక్షురాలు మర్రి రేణుక, శ్రీశైలంగౌడ్ తదితరులున్నారు.

మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు బక్రీద్ శుభాకాంక్షలు

మిర్యాలగూడటౌన్, జూన్ 16 : ముస్లింలకు మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ఆదివారం బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలకు వెరువకుండా దేవుడిపై విశ్వాసాన్ని కలిగి సన్మార్గంలో జీవనాన్ని సాగించాలనే గొప్ప సందేశాన్ని ఈ పండుగ మానవాళికి తెలియజేస్తుందన్నారు. తమకున్న దాంట్లో నుంచే ఇతరులకు పంచిపెట్టడాన్ని మించిన ధాతృత్వం మరోటి లేదనే స్ఫూర్తిని బక్రీద్ పండుగ కలిగిస్తుందన్నారు.

కుళ్లిన పండ్లతో జ్యూస్.. వ్యక్తికి అస్వస్థత

బేకరీలో కుళ్లిన పండ్లు

హాలియా, జూన్ 16 : రోజుల తరబడి ఫ్రిజ్‌లో పెట్టిన, కుళ్లిపోయిన పండ్లతో జ్యూస్ తయారు చేసి నిర్వాహకులు కస్టమర్ల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. హాలియా పట్టణంలో గల ఫేమస్ బేకరీలో కుళ్లిన పండ్లతో చేసిన జ్యూస్ తాగి వెంకటేశ్వర్లు అనే వ్యక్తి అస్వస్థతకు గురయ్యాడు. వాంతులు, విరేచనాలు అవ్వడంతో ఆదివారం మళ్లీ అదే బేకరీకి వెళ్లి మ్యాంగో జ్యూస్ ఆర్డర్ చేశాడు. అందులో నుంచి కూడా కుళ్లిన వాసన వస్తుండడంతో నిర్వాహకులను నిలదీయగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పినట్లు తెలిపాడు. వెంటనే ఫ్రిజ్ తెరిచి చూడగా అన్నీ కుళ్లిన పండ్లు ఉన్నాయని వెంకటేశ్వర్లు మీడియాకు తెలిపాడు. పుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నాడు. ఈ విషయమై బేకరీ నిర్వాహకుడిని వివరణ కోరగా కావాలనే తమపై ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు.

వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

వాటర్ ట్యాంకులను బహూకరిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

నకిరేకల్, జూన్ 16 : ఇంటర్నేషనల్ వాసవీ క్లబ్ ఆదేశాలతో డాన్ టు డస్క్ (సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు) సేవా కార్యక్రమాల్లో భాగంగా వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని సత్యసాయి మందిరంలో 15 మంది పేద విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందించారు. వీధి వ్యాపారులకు ఐదు గొడుగులు, పోలీసులకు టవల్స్, ఐదు ఎన్95 మాస్కులు, మధ్య తరగతి కుటుంబానికి రెండు వెయ్యి లీటర్ల కెపాసిటీ వాటర్ ట్యాంకులు, నేత్రదానం, ఆర్గాన్ డొనేషన్ అంగీకార పత్రం, వాసవీ మాత దేవాలయానికి ట్యూబ్ లైట్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథి వాసవీయన్ గోల్డెన్ స్టార్ గంగిశెట్టి గంగాధర జగదీశ్ కుమార్, గౌరవ అతిథి ఉప్పల వెంకటరమణ పర్యవేక్షణలో రీజియన్ చైర్మన్ దేవరశెట్టి సత్యనారాయణమూర్తి రీజియన్‌లో దాదాపు రూ.27వేల విలువగల వస్తువులు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ శివకోటి ఆంజనేయులు గుప్తా, వాసవీ వనితా క్లబ్ అధ్యక్షురాలు వాడకట్టు రాధిక, ప్రధాన కార్యదర్శి కందగట్ల భవాని, కోశాధికారి శర్వీరాల శ్రీలత, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఏఈఈ పోస్టుకు బాలరాజు ఎంపిక

కట్టంగూర్, జూన్ 16 : మండలంలోని అయిటిపాముల గ్రామానికి చెందిన ముక్కెర బాలరాజు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ఎంపికయ్యాడు. ఈ నెల 14న తెలంగాణ స్టేట్ పబ్లిక్‌సర్వీస్ కమీషన్ ప్రకటించిన ఫలితాల్లో ఏఈఈ ఉద్యోగం పొందాడు. బాలరాజు 1 నుంచి 4వ తరగతి వరకు స్థానిక ప్రభుత్వ పాఠశాల, 5 నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ సర్వేల్ గురుకుల పాఠశాల, ఇంటర్ నల్లగొండ గీతాంజలి కళాశాల, బీటెక్ (అగ్రికల్చల్ ఇంజినీరింగ్) సంగారెడ్డి అగ్రికల్చల్ ఇంజినీరింగ్ కళాశాలలో చదివాడు. చిన్న వయస్సులోనే ప్రభుత్వ ఉద్యోగం సాధించడం పట్ల గ్రామస్తులు, తల్లిదండ్రులు అభినందించారు.

వెంచర్‌లో గుర్తు తెలియని మృతదేహం

నార్కెట్‌పల్లి, జూన్ 16 : మండలంలోని చెర్వుగట్టు గ్రామ శివారులో భాగ్యనగర్ గ్రీన్ సిటీ వెంచర్‌లో ఆదివారం ఒక వేప చెట్టు కింద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాలు.. 45